సాక్షి నంద్యాల

సోమవారం ၊ 7 ၊ ఏప్రిల్ ၊ 2025



మహానందిలో సండే సందడి

మహానంది: శ్రీరామనవమి పర్వదినంతో పాటు ఆదివారం సెలవు రోజు కావడంతో మహానంది ఆలయం భక్తులతో పోటెత్తింది. స్వామిఅమ్మ వార్లను దర్శించుకున్నారు.



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



ఆరోగ్యమే మహాభాగ్యం!

ఆస్తులు, అంతస్తులు లేకపోయినా ఫర్వాలేదు... మంచి ఆరోగ్యముంటే చాలనే మాట ఇటీవల చాలా మందిలో వినిపిస్తోంది. ఆరోగ్యమే మహాభాగ్యంతో బతుకుతున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

పెళ్లి కుమారుడిగా రంగనాథుడు



పెళ్లికుమారునిగా ముస్తాబైన తర్తూరు లక్ష్మీ రంగనాథస్వామి

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీ లక్ష్మీరంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆదివారం స్వామివారు పెళ్లికుమారునిగా ముస్తాబయ్యారు. ఉదయం స్వామివారికి అర్చకులు పంచామృత అభిషేకాలు, పుష్పార్చన, కుంకుమార్చన వంటి విశేషపూజలు చేపట్టారు. అనంతరం స్వామివారిని పట్టువస్త్రాలతో పెళ్లికుమారునిగా అర్చకులు అలంకరించారు. స్వామివారు తర్తూరులో పెళ్లికుమారునిగా ముస్తాబైన అనంతరం ఇక్కడ పదిరోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. అయితే తర్తూరులో స్వామివారికి కల్యాణం నిర్వహించరు. బ్రహ్మోత్సవాల అనంతరం స్వామి వారు నెల్లూరు జిల్లాల్లోని శ్రీరంగాపురంలో జరిగే కల్యాణ వేడుకలకు తరలివెళ్తారని, అక్కడ శ్రీలక్ష్మి సమేత రంగనాథ స్వామివార్లకు కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారని పూజారులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం స్వామివారికి సింహ వాహనసేవ నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి ఈశ్వరరెడ్డి, ఈఓ సాయికుమార్, ఫెస్టివల్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి తెలిపారు.

శ్రీశైలంలో 15న కుంభోత్సవం



అధికారులతో సమీక్షిస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 15న భ్రమరాంబాదేవి అమ్మవారికి కుంభోత్సవం నిర్వహించనున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. దేవస్థాన పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. కుంభోత్సవం నిర్వహించే రోజు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, అమ్మవారి ఆలయ మెట్ల మార్గంలో అదనపు క్యూలైన్లను ఏర్పాటు చేయాలన్నారు. దేవదాయ చట్టాన్ని అనుసరించి క్షేత్ర పరిధిలో జంతు, పక్షి బలులు, జీవహింస పూర్తిగా నిషేధించామన్నారు. క్షేత్రంలోని ప్రధాన ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సుల్లో కూడా పోలీసు, రెవెన్యూ సిబ్బంది తనిఖీలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో దేవస్థాన వైదిక సిబ్బంది, శాఖాధిపతులు, విభిన్న విభాగాల పర్యవేక్షకులు, తహసీల్దార్ కేవీ శ్రీనివాసులు, సీఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మధ్యాహ్నం వరకే

నంద్యాల: ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే కార్యక్రమం మధ్యాహ్నం లోపు పూర్తయ్యేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలందరూ గమనించాలన్నారు.

వారిది ఆత్మహత్యాయత్నం



గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ

పాములపాడు: ఇస్కాల గ్రామంలో సోమేశ్వరుడు అనే రైతు నలుగురు కుటుంబ సభ్యులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ తెలిపారు. గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు అతిసార లక్షణాలతో అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరడంతో డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆదివారం ఇస్కాలను సందర్శించారు. అయితే గ్రామంలో డయేరియా కేసులు లేవని నిర్ధారించారు. సోమేశ్వరుడు అప్పుల బాధతో కుటుంబసభ్యులతో కలసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసిందన్నారు. విషయాన్ని జిల్లా కలెక్టర్ రాజకుమారికి సమాచారం ఇచ్చామన్నారు. ఆయన వెంట డాక్టర్ నాగలక్ష్మి, సర్పంచు మౌలాలి, హెల్త్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వ్యాపారులపై విద్యుత్ పిడుగు

- స్మార్ట్ మీటర్లతో ఇబ్బడిముబ్బడిగా బిల్లులు
- సంక్షోభంలో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు
- గతంలో నెలవారీ బిల్లు రూ.2వేల నుంచి రూ.10వేలలోపే
- రెండు నెలలుగా బిల్లులు రూ.30 వేలపైనే
- గగ్గోలు పెడుతున్న వ్యాపార, పారిశ్రామిక వేత్తలు



స్మార్ట్ మీటర్

స్మార్ట్ షాక్!



ఇక గృహ వినియోగదారుల దోపిడీ

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో కూటమి ప్రభుత్వం గృహ వినియోగదారులను సైతం దోపిడీ చేస్తోంది. మొదటి విడతలో 200 యూనిట్లు, ఆపైన వాడకం ఉన్న వినియోగదారుల నివాసాల్లో స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియ మొదలైంది. వినియోగదారుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నా అధికారులు ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీలు.. 2022, 2023, 2025 సర్దుబాటు చార్జీల పేరిట వినియోగదారులపై సగటున రూ.500 నుంచి రూ.1500 వరకు భారం మోపుతోంది. స్మార్ట్ మీటర్లు బిగిస్తే రానున్న రోజుల్లో విద్యుత్ బిల్లులు ఏ స్థాయిలో ఉంటాయోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లతో వినియోగదారులను దోపిడీ చేస్తోంది. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. గతంలో వీటిని వ్యతిరేకించిన టీడీపీ కూటమి నేతలు ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత స్మార్ట్ మీటర్ల టెక్నాలజీలో మార్పులు తెచ్చి మొదటి దశలో కమర్షియల్ కనెక్షన్‌లు కేటగిరి–2, పరిశ్రమల కనెక్షన్‌లు కేటగిరి–3లకు స్మార్ట్ మీటర్లు బిగించింది. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో ఒక్కసారిగా నాలుగు అంకెల్లో ఉన్న బిల్లులు ఐదు అంకెల్లోకి వెళ్లిపోయాయి. దీంతో వ్యాపార, పారిశ్రామిక వేత్తల్లో ఆందోళన మొదలైంది. 2024 ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత సంపద సృష్టించి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని టీడీపీ అధినేత ప్రచారాన్ని ఊదరగొట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రజలపై విద్యుత్ బిల్లుల భారం మోపడం చూస్తుంటే సంపద సృష్టి అంటే ఇదా అని ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. అడ్డగోలుగా వస్తున్న విద్యుత్ బిల్లులపై ఫిర్యాదు చేయడానికి వెళితే స్పందించే అధికారులు కూడా కరువయ్యారనే ఆందోళన వినియోగదారుల్లో వ్యక్తమవుతోంది.

1.07 లక్షల కేటగిరీ–2 కనెక్షన్‌లకు స్మార్ట్ మీటర్లు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 17,06,665 విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. ఇందులో 12,67,748 హౌస్‌హోల్డ్ కనెక్షన్‌లు. కమర్షియల్ కేటగిరీ–2 కింద 1,58,252, పరిశ్రమల కేటగిరీ–3 కింద 9,698 ఉన్నాయి. ఇప్పటి వరకు కేటగిరి–2, కేటగిరి–3 కనెక్షన్‌లకు 1.11 లక్షల స్మార్ట్ మీటర్లు బిగించారు. డిసెంబర్ నుంచి స్మార్ట్ మీటర్లను బిగించే కార్యక్రమం జరుగుతోంది. స్మార్ట్ మీటర్ల బిగింపుతో వ్యాపార, పారిశ్రామికవేత్తల్లో అలజడి మొదలైంది. స్మార్ట్ మీటర్లు బిగించక ముందు రూ.2వేల నుంచి రూ.3వేల వరకు వస్తున్న విద్యుత్ బిల్లులు ఒక్కసారిగా రూ.30 వేలు దాటుతున్నాయి. దీంతో వ్యాపారులు, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల యజమానులు బెంబేలెత్తుతున్నారు. స్మార్ట్ మీటర్లు వద్దని.. వెనక్కు తీసుకోవాలని విద్యుత్ అధికారుల వద్దకు క్యూ కడుతున్నారు. ఈ విషయంలో తాము ఏమీ చేయలేమని, ఎంత బిల్లు వస్తే అంత గడువులోపు చెల్లించకపోతే కనెక్షన్ తొలగిస్తామని అధికారులు తేల్చి చెబుతుండటం గమనార్హం.

నెపం కెపాసిటర్లపైకి..

- ➢ విద్యుత్ బిల్లులు అధిక మొత్తంలో రావడానికి స్మార్ట్ మీటర్లు కారణం కాదని.. కెపాసిటర్ల వల్లే అలా వస్తున్నాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు.
- ➢ సాధారణంగా రీడింగ్‌ను బట్టి బిల్లులు రావాల్సి ఉంది.
- ➢ సామర్థ్యం ఎక్కువగా ఉంటే స్మార్ట్ మీటర్లు రీడింగ్‌ను బట్టి కాకుండా కేపాసిటర్ సామర్థ్యాన్ని బట్టి బిల్లు ఇస్తుంది.
- ➢ కేపాసిటర్ల సామర్థ్యం ఎక్కువగా ఉన్న వారు దానిని తగ్గించుకునేందుకు నానా తిప్పలు పడుతున్నారు.
- ➢ స్మార్ట్ మీటర్ల వల్ల మొదటి నెలలోనే సగటున వినియోగదారుడిపై రూ.50 వేలకుపైగా భారం పడింది.

డివిజన్ వారీగా ఉమ్మడి జిల్లాలో బిగించిన స్మార్ట్ మీటర్లు	
ఆదోని	17,950
డోన్	13,570
కర్నూలు	21,864
ఆత్మకూరు	9,945
నంద్యాల	35,890
ఎమ్మిగనూరు	12,670
మొత్తం	1,11,889

బిల్లు రూ.30 వేలు దాటింది

కర్నూలు నగరంలోని సంతోష్‌నగర్‌కు చెందిన జె.ఉస్మాన్‌కు కమర్షియల్ విద్యుత్ కనెక్షన్ ఉంది. ఈయనకు గత ఏడాది నవంబర్‌లో రూ.3,380, డిసెంబర్‌లో రూ.7,223 బిల్లు వచ్చింది. అదే నెలలో విద్యుత్ అధికారులు స్మార్ట్ మీటరు బిగించారు. జనవరి 2న వచ్చిన బిల్లు చూసి ఉస్మాన్ షాక్‌కు లోనయ్యాడు. ఏకంగా రూ.30,758 బిల్లు వచ్చింది. ఫిబ్రవరిలో వచ్చిన బిల్లు కూడా రూ.29,524 ఉంది. అధికారులను సంప్రదిస్తే ఏమీ చేయలేమని చేతులు ఎత్తేశారు.



2024 నవంబర్ నెల బిల్లు రూ.7,223



స్మార్ట్ మీటరు బిగించిన తర్వాత జనవరి బిల్లు రూ.30,758



ఫిబ్రవరి నెల బిల్లు రూ.29,524

మీటరు రీడర్ల ఉపాధిపై దెబ్బ

గ్రామ, పట్టణాల్లో కనెక్షన్‌లను బట్టి మీటర్లు రీడర్లు ఉపాధి పొందుతున్నారు. ప్రతి నెలా 1 నుంచి 6 తేదీల మధ్య వీరు ఇంటింటికీ వెళ్లి రీడింగ్‌ను బట్టి బిల్లులు ఇస్తున్నారు. స్మార్ట్ మీటర్లు బిగించడం ద్వారా మీటరు రీడర్లతో అవసరం ఉండదు. ప్రతి నెలా 1వ తేదీ రాత్రికే విద్యుత్ అధికారులు ఆఫీసుల నుంచే వినియోగదారుల సెల్ నెంబర్‌కు వాట్సాప్ ద్వారా బిల్లులు పంపుతారు. తద్వారా మీటరు రీడర్లు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ఎన్నికల సమయంలో పెద్ద ఎత్తున ఉద్యోగాలు ఇస్తామంటూ ప్రకటించిన కూటమి నేతలు, ఇప్పుడు ఉన్న ఉద్యోగాలను కూడా తొలగిస్తుండటం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది.

ధాన్యం ఇంటికి చేరేనా?

- అకాల వర్షాలతో వరి రైతు కుదేలు
- దిగుబడిపై తీవ్ర ప్రభావం
- పంట నూర్పిడికి అదనపు భారం

కోవెలకుంట్ల: ఖరీఫ్‌లో ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టాలు మూటగట్టుకున్న వరి రైతులకు రబీ సీజన్ కూడా కలిసి రావడం లేదు. నాట్లు వేసినప్పటి నుంచి ఒకవైపు సాగునీటి కష్టాలు, పంట చేతికందే సమయంలో అకాల వర్షాలు వెంటాడుతుండటంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జిల్లాలోని 29 మండలాల్లో ఈ ఏడాది రబీలో 28 వేల హెక్టార్లలో వరి సాగు సాధారణ విస్తీర్ణం కాగా ఆయా మండలాల పరిధిలో బోర్లు, బావులు, చెరువులు, ఎస్సార్బీసీ, కేసీ కెనాల్, కుందూనది, పాలేరు, కుందరవాగు పరివాహక ప్రాంతాల్లో 25 వేల హెక్టార్లలో వరి సాగు చేశారు. ఇందుల్లో స్థానిక సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల మండలంలో 725 హెక్టార్లు, సంజామల మండలంలో 203 హెక్టార్లు, అవుకు మండలంలో 1,552 హెక్టార్లు, కొలిమిగుండ్ల మండలంలో 17 హెక్టార్లు, ఉయ్యాలవాడ మండలంలో 761 హెక్టార్లు, దొర్నిపాడు మండలంలో 296 హెక్టార్లలో సాగైంది. ప్రస్తుతం పైరు రెండున్నర నెలలకు చేరుకుని పొట్ట దశలో ఉంది. మరో నెల రోజుల్లో పంట దిగుబడులు చేతికందనున్నాయి. ఇటీవల కాలంలో పది రోజుల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా రెండు పర్యాయాలు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పంట చేతికందే తరుణంలో అకాల వర్షాలు కురవడంతో పొట్ట దశలో ఉన్న పైరు నేలవాలి వడ్లు రాలిపోయాయి. కొని ప్రాంతాల్లో వరి పూర్తిస్థాయిలో పంటంతా నీట మునిగింది. మరో నెలరోజుల్లో దిగుబడులు చేతికందుతాయనుకుంటే వరణుడు కోలుకోలేని దెబ్బతీయడంతో రైతులు కుదేలవుతున్నారు. ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయనుకుంటే అకాల వర్షం నిలువునా ముంచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖరీఫ్‌లోనూ నష్టాల దిగుబడి

ఈ ఏడాది జిల్లా రైతాంగానికి ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు కలిసిరాలేదు. జిల్లాలోని దాదాపు 66 వేల హెక్టార్లలో సాగు చేశారు. రసాయన ఎరువులు, వరి నారు, క్రిమి సంహారక మందులు, కలుపు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 35 వేల నుంచి రూ. 40 వేలు వెచ్చించారు. కౌలు రైతులు ఎకరాకు ఖరీఫ్‌లో 10 బస్తాలు, రబీలో మూడు బస్తాల వడ్లు చెల్లించేలా వరిమడులను కౌలుకు తీసుకున్నారు. పైరు వివిధ దశల్లో అధిక వర్షాలు కురవడంతో వరిని దోమపోటు, అగ్గి తెగులు ఆశించడంతో తెగుళ్ల బారి నుంచి పంటను రక్షించుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. అక్టోబర్ నెలలో తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి. ఎకరాకు 30 బస్తాలకు మించి దిగుబడులు రాలేదు. ఈ క్రమంలో గిట్టుబాటు ధర అంతంత మాత్రంగానే పలికింది. గతేడాది క్వింటా రూ. 2,200 ధర పలకగా ఈ ఏడాది బస్తా రూ. 1,490 అమ్ముకుని నష్టాలు మూటగట్టుకున్నారు.



పెట్టుబడి నేలపాలు..

గడివేముల మండలం కరిమద్దెలలో నేలవాలిన వరి పైరును చూపిస్తున్న రైతు పేరు రామకృష్ణ. ఎకరాకు 8 బస్తాలు కౌలు చెల్లించేలా 40 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని ఈ ఏడాది రబీ సీజన్‌లో వరి సాగు చేశాడు. నారు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కలుపు నివారణ, తదతర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 30 వేలు ఖర్చు చేశాడు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి పంట మొత్తం నేలవాలి తీవ్ర నష్టం వాటిల్లింది. దిగుబడి చేతికందే తరుణంలో అకాల వర్షం ఆ రైతు కొంపముంచింది.

నేలవాలిన వరితో అదనపు భారం

జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో ఇటీవల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కురిసిన అకాల వర్షాల వల్ల వివిధ ప్రాంతాల్లో వరి నేలవాలి చేతి కందకుండా పోయింది. పైరు నేల వాలడంతో వడ్లు రాలిపోయి నష్టం చేకూరింది. ఎకరాకు రెండు బస్తాలకు పైగా వడ్లు వరిమడిలో రాలిపోయినట్లు తెలుస్తోంది. రాలిపోయిన వడ్లు చేతికందే పరిస్థితి లేకపోగా మిగిలిన దిగుబడులను దక్కించుకునేందుకు రైతులపై అదనపు భారం పడనుంది. కూలీల సాయంతో పడిపోయిన వరిని కట్టలు కట్టుకోవాల్సి ఉంది. నేలవాలిన వరిలో యంత్రం సాయంతో నూర్పిడి మరింత కష్టంగా ఉంటుంది. వరి కట్టలు కట్టుకోవడం, నూర్పిడి వంటి పనులతో ఎకరాకు అదనంగా రూ. 5 వేలు అదనపు భారం పడుతుందని రైతులు వాపోతున్నారు. పెట్టుబడులు, రెక్కలకష్టం పైరుపై పెట్టి దిగుబడులు దక్కించుకునేందుకు రైతులు అదృష్టాన్ని పరిక్షించుకుంటున్నారు.

అకాల వర్షాలు భయపెడుతున్నాయి



ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన వరిపైరును వేసవికాలం అకాల వర్షాలు భయపెడుతున్నాయి. పది ఎకరాల సొంత పొలంతోపాటు మరో పది ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాను. పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 30 వేలకు పైగా వెచ్చించాను. మరో నెల రోజులపాటు వర్షాలు పడకుంటే దిగుబడులు చేతికందుతాయి. ఈ మధ్య కాలంలో మోస్తరు వర్షం పడినా దిగుబడులు చేతికందకుండా పోతాయి. – వేణుగోపాల్‌రెడ్డి, రైతు, భీమునిపాడు, కోవెలకుంట్ల మండలం

‘చంద్రన్న బీమా’కు గ్రహణం

- పేరు మార్పుతో సరిపెట్టిన కూటమి ప్రభుత్వం
- రూ.10 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి పైసా కూడా ఇవ్వని వైనం
- పెండింగ్‌లో వేలాది క్లైమ్‌లు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ బీమా సక్రమంగా అమలు



నంద్యాల: ఎన్నికల ముందు బీరాలు పలికిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలను అటకెక్కిస్తున్నారు. గత ప్రభుత్వంలో వైఎస్సార్ బీమా పేరుతో ఈ పథకం ఎంతో మంది పేదలకు మేలు జరిగింది. అయితే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల సభల్లో గత ప్రభుత్వాన్ని విమర్శిస్తూ చంద్రన్న బీమాను మళ్లీ అమలు చేస్తామని, రూ.5 లక్షల ఉన్న పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచి అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి పది నెలలు అయినప్పటికీ ఇప్పటి వరకు ఆ ఊసే లేదు. అయిన వారిని కోల్పోయి ఆధారం లేక బీమా కోసం ఎదురు చూస్తున్న బాధితులకు కూడా మొండి చెయ్యి చూపించారు. పరిహారం పెంచడం మాట అటుంచితే గతంలో ఉన్నది ఇవ్వకపోవడంతో బాధితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సుమారు 4,700 క్లైమ్‌లు పెండింగ్‌లో ఉండగా ప్రస్తుతం కనీసం దరఖాస్తులు స్వీకరించడం లేదు. చంద్రన్న బీమా పథకంలో భాగంగా 18–50 ఏళ్ల లోపు వారు సహజ మరణం పొందితే రూ.లక్ష, ప్రమాదవశాత్తూ మృతి చెందినా శాశ్వత వైకల్యం పొందినా రూ.5 లక్షల చొప్పున వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిహారం అందజేశారు. 51–70 ఏళ్ల లోపు వారు ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.3 లక్షలు చొప్పున ప్రమాదంలో పాక్షిక వైకల్యం పొందిన వారికి రూ.2.50 లక్షలు అందజేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాదశవాత్తు ఎవరైనా మరణిస్తే రూ.5 లక్షలు ఇచ్చే పరిహారాన్ని రూ.10 లక్షలు ఇస్తామని చెప్పారే కాని ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు. వ్యక్తి మృతి చెందిన తరువాత బాధిత కుటుంబానికి 30 రోజుల్లోగా పరిహారం అందాల్సి ఉంది. సహజ మరణం పొందిన వ్యక్తి వివరాలను 7 రోజులు, ప్రమాదాలకు గురైతే 15 రోజుల్లోపు సచివాలయాల్లో నమోదు చేయించాలి. బీమా సభ్యుడిగా ఉన్న వ్యక్తి చనిపోతే వెంటనే రూ.10 వేలు మట్టి ఖర్చుల కింద అందజేయాలి. మిగిలిన మొత్తాన్ని నామినీ వ్యక్తి గత బ్యాంకు ఖాతాకు జమ చేయాలి.

బాధిత కుటుంబాలు నిరీక్షణ

నెలలు తరబడి క్లైములు పరిష్కారం కాకపోవడంతో బాధిత కుటుంబాలకు నిరీక్షణ తప్పడం లేదు. వాస్తవానికి 30 రోజుల్లోపే బీమా పరిహారం సొమ్ము బాధిత కుటుంబాలకు అందాల్సి ఉంది. ఇంటి పెద్దను, ఆసరా అందించే వారిని కోల్పోయి కుటుంబాల పోషణ కష్టంగా మారిన పరిస్థితుల్లో ప్రభుత్వం అందిస్తున్న ఈ సొమ్ము వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. కాని కూటమి ప్రభుత్వం బాధితుల ఆర్తనాదాలు వినకుండా హామీని తుంగలో తొక్కి అంత చేస్తున్నాం.. ఇంత చేస్తున్నాం అంటూ ప్రచారాలు మాత్రం చేసుకుంటోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మార్గదర్శకాలు రాలేదు



చంద్రన్న బీమా పథకంపై ఇంకా ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు అందలేదు. ఎవరైనా సాధారణ, ప్రమాదానికి గురై మృతిచెందితే వెంటనే సచివాలయాల్లో నమోదు అవుతున్నాయి. కూటమి ప్రభుత్వం పరిహారాన్ని పెంచి అమలు చేసేందుకు చర్యలు తీసుకుంది. త్వరలోనే పెండింగ్ క్లైమ్‌లతో పాటు కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన క్లైములు కూడా పరిష్కారమయ్యే అవకాశం ఉంది.

–శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ, నంద్యాల

కార్మికుల పేర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలు

కర్నూలు(అర్బన్): ఈ– శ్రమ్ పోర్టల్‌లో ఫ్లాట్ ఫాం కార్మికులు, గిగ్ కార్మికుల పేర్లను నమోదు చేయించేందుకు ఈ నెల 7 నుంచి 17వ తేదీ వరకు ప్రత్యేక నమోదు శిబిరాలను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నట్లు ఉప కార్మిక కమిషనర్ కే వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ – శ్రమ్ పోర్టల్‌లో కార్మికులు తమ పేర్లను నమోదు చేసుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనేక ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

23 వరకు ఇంటర్ ప్రవేశాలు

కర్నూలు సిటీ: జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్స్ సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇంటర్ ఫస్ట్ ఇయర్ ప్రవేశాల ప్రక్రియ ఈ నెల 23వ తేదీ వరకు జరగనుంది. జిల్లాలో మొత్తం 199 జూనియర్ కాలేజీలు ఉండగా 161 మాత్రమే పనిచేస్తున్నాయి. 2025–26 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్యలో కొత్తగా ప్రవేశపెట్టనున్న ఎంబైపీసీ ప్రవేశాలపై స్పష్టత లేదు. ఈ కొత్త కోర్సు అన్ని కాలేజీల్లో ప్రవేశ పెడతారా? లేకపోతే ఎంపిక చేసిన కాలేజీల్లోనే పెడతారా? అనేది స్పష్టత రావాల్సి ఉంది.



కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకుడు

రామరామేతి.. భక్తి జ్యోతి

శ్రీరామనవమి వేడుకలు ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. శ్రీరామ, ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సీతారాముల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉత్సవమూర్తులను ఘనంగా ఊరేగించారు. వడపప్పు, పానకం ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. అన్నదాన ప్రసాదాన్ని వితరణ చేశారు.

– నంద్యాల(వ్యవసాయం)



నంద్యాల సంజీవనగర్ రామాలయంలో రామలోరి కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తజనం

క్లుప్తంగా

రేపు జల వనరుల శాఖ మంత్రి రాక

కర్నూలు సిటీ: జల వనరుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు రేపు(మంగళవారం)జిల్లాకు రానున్నారు. కర్నూలు స్టేట్ గెస్ట్‌హౌస్‌కి చేరుకుని 'కూటమి' నేతలతో సమావేశం అవుతారు. అనంతరం జిల్లాలోని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించనున్నారు. డీఆర్సీ సమావేశంలో పాల్గొననున్నారు. డోన్ రైల్వే స్టేషన్‌కు చేరుకుని రైలులో విజయవాడకు బయలుదేరనున్నారు.

ఇంటి పైకప్పు కూలి వ్యక్తి మృతి

బొమ్మలసత్రం: పట్టణంలోని స్థానిక అంజుమన్ వీధిలో ఆదివారం ఇంటి పైకప్పు కూలి ఓ వ్యక్తి మృతి చెందాడు. సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. అంజుమన్ వీధికి చెందిన రఫీ అహమ్మద్ (54) తన స్నేహితులతో కలిసి వీధి చివరలో ఉన్న ఓ పాతభవనం కింద నిలబడి మాట్లాడుతున్నారు. ఆ సమయంలో భవనం పైకప్పు కూలి అతని తలపై పడింది. వెంటనే స్నేహితులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. తలకు బలమైన గాయం కావటంతో కోలుకోలేక మృతిచెందాడు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

అనారోగ్యంతో ఆత్మహత్య


నల్లబోతుల మహేష్(ఫైల్)

నందవరం: అనారోగ్యంతో నల్లబోతు మహేష్(32) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్మ చేసుకున్నాడు. ఎస్ఐ కేశవ, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు మేరకు.. మహేష్ గత కొన్ని నెలలుగా కడుపు నొప్పి, గ్యాస్ట్రిక్ సమస్యతో బాధపడుతూ ఉండేవాడు. కొన్ని రోజుల క్రితం ఎమ్మిగనూరు ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నా తగ్గకపోవడంతో జీవితం మీద విరక్తి పొంది శనివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఉదయం చూసి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి ఆదివారం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోర్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మహేష్‌కు భార్య జ్యోతి, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

పండుగ పూట విషాదం

- గేదే ఢీకొని విద్యార్థి దుర్మరణం


నాగార్జున(ఫైల్)

కొలిమిగుండ్ల: ఇంటిల్లిపాది పండుగను సంతోషంగా జరుపుకునే సమయంలో గేదే రూపంలో ఓవిద్యార్థిని మృత్యు కబళించింది. ఈవిషాదకర సంఘటన ఆదివారం నందిపాడులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన గుండ్ర నాగన్న, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు నాగార్జున(16) బనగానపల్లె పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతూ ఇటీవలనే పబ్లిక్ పరీక్షలు రాసి ఇంటికొచ్చాడు. ఉదయం పని మీద బైక్‌పై సమీపంలోని తిమ్మనాయినపేట జంక్షన్ వరకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఊరి శివారులోకి వచ్చే సరికి పొలాల్లో నుంచి గేదే వేగంగా ప్రధాన రహదారిపైకి దూసుకొచ్చి బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో నాగార్జున ఎగిరి కింద పడటంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున ప్రమాద స్థలానికి చేరుకున్నారు. రక్తపు మడుగులో అచేతనంగా పడి ఉన్న కుమారుడి మృతదేహం మీద పడి తల్లి లక్ష్మీదేవి విలపించిన తీరు గ్రామస్తులను కలచివేసింది. పదో తరగతి పరీక్ష ఫలితాలు రాగానే మంచి కళాశాలలో కుమారుడిని ఇంటర్‌లో చేర్పించాలని తల్లిదండ్రులు కలలు కన్నారు. పండుగ రోజే మృత్యుఒడికి చేరడంతో వారి ఆవేదనకు అంతు లేకుండా పోయింది. ప్రమాద విషయం తెలుసుకున్న సీఐ రమేష్‌బాబు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.


దిగువ అహోబిలం మాడ వీధుల్లో భక్తజనం మధ్య ఉత్సవమూర్తుల ఊరేగింపు


మహానందిలో సీతారాముల వారికి పట్టువస్త్రాలు తెస్తున్న జిల్లా న్యాయమూర్తి పి.వాసు దంపతులు


కర్నూలు నగరంలో సీతారాములను దర్శించుకుంటున్న భక్తులు


చౌరస్తా ఆంజనేయ స్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణ దృశ్యం


నగరంలో శ్రీరామ నవమి వేడుకలను తిలకిస్తున్న భక్తులు

రాములోరి కల్యాణం

ఓ వైపు భక్తుల రామజపం.. మరోవైపు వేద పండితుల వేద మంత్రోచ్ఛారణల మధ్య సీతారాముల కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన ఈవేడుకలు ఉమ్మడి కర్నూలు జిల్లాలో అంబరాన్నంటాయి. మహిళలు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకుని స్వామివార్ల కల్యాణాన్ని తిలకించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. ప్రవచనకారులు, వక్తలు, పండితులు శ్రీరాముని జీవిత చరిత్రను వివరించారు. సాయంత్రం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవాలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


కృష్ణగిరిలో ప్రత్యేక అలంకరణలో సీతారాముల వారు


కోడుమూరులో ..


మద్దికెరలో స్వామి,అమ్మవార్లపై తలంబ్రాలు పోస్తున్న అర్చకులు


బనగానపల్లెలో సీతారాముల కల్యాణ మహోత్సవంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులు, చిత్రంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా


వెలుగోడులో భక్తులకు పానకం పంపిణీ


కృష్ణగిరి మండలం పెనుమాడ గ్రామంలో సీతారాముల కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న పూజారి


కోడుమూరులో రాములోరి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు


వెంకటరమణ కాలనీలో అన్నదాన దృశ్యం


హొళగుంద మండలం సుకువాయిలో ఆంజనేయస్వామి రథోత్సవం


మారందొడ్డిలో భక్తజనం మధ్య సీతారాముల వారి ప్రభోత్సవం


నందవరం .. సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వాముల ఉత్సవమూర్తుల ఊరేగింపు

ఆరోగ్యమే మహాభాగ్యం!

- ఆరోగ్యంపై ప్రజల్లో పెరిగిన శ్రద్ధ
- ఆహారపు అలవాట్లలో మార్పు
- వ్యాయామానికి ప్రాధాన్యం
- నేడు ప్రపంచ ఆరోగ్య దినం

కర్నూలు(హాస్పిటల్): ఆస్తులు, అంతస్తులు లేకపోయినా ఫర్వాలేదు...మంచి ఆరోగ్యముంటే చాలనే మాట ఇటీవల చాలా మందిలో వినిపిస్తోంది. ఎందుకంటే సమాజంలో ప్రతి ముగ్గురిలో ఒకరు ఏదో ఒక జబ్బుతో ప్రస్తుతం బాధపడుతున్నారు. దీంతో వారి విలువైన జీవితాన్ని, కాలాన్ని కోల్పోతున్నారు. ఆనందమయంగా జీవించలేకపోతున్నారు. అందుకే నేడు చాలా మంది ఆరోగ్యమే మహాభాగ్యం అనే ధోరణితో బతుకుతున్నారు. అనేక ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినంగా నిర్వహిస్తున్నారు. ఎన్‌సీడీ 2.ఓలో భాగంగా అసంక్రమిత వ్యాధులపై జిల్లాలో సర్వే నిర్వహిస్తున్నారు. 18 ఏళ్లు పైబడిన వారు ఇందులో 19,12,227 మంది ఉన్నారు. ఇందులో 5,50,034 మందికి పరీక్ష చేయగా 29.40 శాతం మందికి బీపీ, 17.85 శాతం మందికి షుగర్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. వీరితో పాటు 1,817 మందికి నోటి క్యాన్సర్, 1,063 మందికి రొమ్ము క్యాన్సర్, 862 మందికి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారించారు. 45,040 మంది గర్భిణులు రిజిస్టర్ కాగా అందులో 10,072 మంది గర్భిణులు హైరిస్క్‌లో ఉన్నట్లు తేల్చారు. అలాగే జిల్లాలో ప్రస్తుతం 3,077 మందికి టీబీ, 395 మందికి కొత్తగా కుష్టు వ్యాధి ఉండగా, ఏఆర్‌టీ కేంద్రాల్లో నమోదైన 18,843 మందిలో 7,485 మంది ఎయిడ్స్ బాధితులు ఉన్నారు. దోమల కారణంగా వచ్చే వ్యాధులైన డెంగీతో 400 మంది గత సంవత్సరం బాధపడ్డారు. పై వ్యాధులన్నీ అధిక శాతం జీవనశైలి కారణంగా వచ్చినవే. కొన్ని వంశపారంపర్యంగా, ఇంకొన్ని సీజనల్ వ్యాధులు, పోషకాహారలోపం కారణంగా వస్తున్న వ్యాధులు. వీటన్నింటినీ అధిగమించాలంటే సరైన జీవనవిధానం అవసరమని వైద్యులు సూచిస్తున్నారు.



- మనిషికి ఆహారం ఎంత ముఖ్యమో వ్యాయామమూ అంతే ముఖ్యం. వారానికి కనీసం 150 నిమిషాలు వ్యాయామం చేయాలని వైద్యులు సూచిస్తున్నారు.
- రోగనిరోధక వ్యవస్థ చక్కగా ఉండాలన్నా, మానసిక ప్రశాంతంగాకు నాణ్యమైన నిద్ర ఉండాలి.
- ధూమ, మద్యపానంతో ఊపరితిత్తుల క్యాన్సర్, శ్వాసకోశ, గుండె, కాలేయ జబ్బులు వచ్చే అవకాశం ఉంది. ఈ దురలవాట్లకు దూరంగా ఉంటే మంచిది.
- శరీరంతో పాటు ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ముందస్తుగా కొన్ని రకాల హెల్త్ చెకప్‌లు అప్పుడప్పుడూ చేయించుకోవాలి.
- ఒంటరితనం అనారోగ్యానికి బాటలు వేస్తుంది. సామాజిక సంబంధాలు మెరుగుపరుచుకోవాలి. పదిమందిని కలుస్తూ స్నేహ జీవితాన్ని కొనసాగించాలి.

సమతుల ఆహారం తినాలి



ప్రతి ఒక్కరూ నిత్యం సమతుల ఆహారం తీసుకోవాలి. తినే ఆహారంలో ప్రోటీన్లు, ఫైబర్, ఐరన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలు ఉండేలా చూసుకోవాలి. ఇందుకోసం పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, కోడిగుడ్లు, చికెన్ వంటివి తినాలి. దీంతో పాటు ప్రతి రోజూ 8 గ్లాసుల నీటిని కచ్చితంగా తాగేలా చూసుకోవాలి.
–డాక్టర్ రవికళాధర్‌రెడ్డి, జనరల్ ఫిజీషియన్, కర్నూలు

మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలి



ఆధునిక సమాజంలో ఒత్తిడితో కూడిన జీవితం ప్రతి ఒక్కరికీ ఎక్కువవుతోంది. దీర్ఘకాలంగా ఉండే ఒత్తిడి మానసిక ఆరోగ్యాన్ని ఎంతో ప్రభావితం చేస్తుంది. దీని వల్ల ఊబకాయం, గుండెజబ్బులు, డిప్రెషన్ వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. ఒత్తిడిని తగ్గించుకునేందుకు ధ్యానం, ప్రాణాయామాలు, యోగా, పచ్చని ప్రకృతిలో గడపడం వంటివి చేయాలి. –డాక్టర్ టీఎస్. ప్రవీణ్‌కుమార్, కార్డియాలజిస్టు, కర్నూలు

లారీ ఢీకొని గొర్రెల కాపరి మృతి

- మరో ముగ్గురికి గాయాలు
- ముగతి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై దుర్ఘటన


లింగారావు(ఫైల్)

నందవరం: లారీ ఢీకొని కురవ లింగారావు(20)అనే గొర్రెల కాపరి మృతి చెందగా, మరో ముగ్గురు గొర్రెల కాపర్లు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన మండల పరిధిలోని ముగతి గ్రామ సమీపంలోని 167వ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో చోటుచేసుకుంది. ఎస్ఐ కేశవ తెలిపిన వివరాలు ఇవి.. ధర్మపురం గ్రామానికి చెందిన 130 గొర్రెలకు కాపర్లుగా ఎమ్మిగనూరు మండలం కే. తిమ్మాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు, ఆస్పరి మండలం జొహరాపురం గ్రామానికి చెందిన కురవ లింగారావు అలియాస్ లింగప్ప, బోయ నరసన్న, గొల్ల నరసప్ప, కురవ బడేసాబ్‌లను కూలీలుగా పెట్టుకున్నారు. ఆదివారం కావడంతో ధర్మాపురం టోల్‌గేట్ వద్ద నుంచి నలుగురు కాపర్లు తెల్లవారుజామున గొర్రెల మందతో ఎమ్మిగనూరు సంతకు బయలు దేరారు. ముగతి గ్రామ సమీపంలోని 167వ జాతీయ రహదారిపై ఎడమవైపు వెళ్తున్న గొర్రెల మందతో పాటు కాపర్లును వెనుక నుంచి గుర్తుతెలియని లారీ ఢీకొట్టుకుంటూ వెళ్లింది. తలకు తీవ్ర రక్త గాయం కావడంతో లింగారావు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. శ్రీనివాసులుకు కుడి మణికట్టు దగ్గర, కుడి కాలు భాగంలో మోకాలి వద్ద రక్త గాయాలయ్యాయి. బోయ నరసన్నకు మెడ, నడుముకు గాయాలు కాగా, గొల్ల నరసన్న ఎడమ కాలు పాదం దగ్గర ఎముక విరిగింది. కురవ బడేసాబ్‌కు ఈ ప్రమాదంలో ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదంలో మూడు గొర్రెలు మృత్యువాత పడగా, 20 గొర్రెలు గాయపడినట్లు ఎస్ఐ తెలిపారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన గొల్ల నరసప్ప, బోయ నరసన్నలను చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి రేఫర్ చేశారు. బాధితుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


రాలిపోయిన మామిడికాయలు


నేలకొరిగిన మామిడి చెట్టు

నేలరాలిన ఆశలు

గాలివాన బీభత్సం సృష్టించింది. రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఆదివారం సాయంత్ర ఆత్మకూరు ప్రాంతంలో పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో చుట్టుపక్కల గ్రామాల్లో చెట్లు విరిగిపడ్డాయి. చేతికొచ్చిన వరి తదితర పంటలు దెబ్బతిన్నాయి. ఆత్మకూరు, కురుకుందలలో మామిడి చెట్లు నేలకొరిగాయి. అరకొరగా కాసిన మామడి కాయలు సైతం రాలిపోయాయి. ప్రభుత్వం నష్ట పరిహారం అందజేసి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు. – ఆత్మకూరు

పొలంలో అనుమానాస్పద మృతి


ఉప్పర ఉమాపతి (ఫైల్)

ఆస్పరి: దేవనకొండ మండలం తెర్నేకల్లు గ్రామానికి చెందిన ఉప్పర ఉమాపతి (30) అనే వ్యక్తి ములుగుందం నుంచి అగ్రహారం వెళ్లే రోడ్డు పక్కన ఉన్న పొలంలో అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఆస్పరి సీఐ మస్తాన్‌వలి తెలిపిన వివరాలు మేరకు.. తెర్నేకల్లుకు చెందిన ఉప్పర ఉమాపతి ఈనెల 5వ తేదీ తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఈయనకు మతిస్థిమితం సరిగ్గా లేదు. ములుగుందం నుంచి అగ్రహారం వెళ్లే రోడ్డు పక్కన పొలంలో ఉమాపతి మృతదేహం ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కర్నూలు నుంచి క్లూస్ టీం, డ్వాగ్ స్క్వాడ్ వచ్చి పరిశీలించినట్లు సీఐ తెలిపారు. ఉమాపతికి భార్య సుజాత, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

హాస్టల్ విద్యార్థి నిజాయితీ


తనకు దొరికిన సెల్‌ఫోన్‌ను వార్డెన్‌కు అందిస్తున్న విద్యార్థి

వెల్దుర్తి: తనకు దొరికిన సెల్‌ఫోన్‌ను ఓ హాస్టల్ విద్యార్థి వార్డెన్‌ను అందించి నిజాయతీ చాటుకున్నాడు. వెల్దుర్తి ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఆదివారం ఉదయం విద్యార్థులు పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. హాస్టల్‌తోపాటు చుట్టుపక్కల ఆవరణలో చెత్తాచెదారం తొలగించారు. ఈ సందర్భంగా 8వ తరగతి చదువుతున్న శాంతిరాజుకు సెల్‌ఫోన్ కనబడింది. నిజాయతీతో సెల్‌ఫోన్‌ను తమ వార్డెన్ ఉస్మాన్ బాషాకు అప్పగించాడు. విద్యార్థిని అభినందించిన వార్డెన్.. సెల్‌ఫోన్‌లో ఉన్న నంబర్ల ద్వారా యజమాని విజయ్‌కుమార్‌కు ఫోన్ చేశాడు. గుంటూరు కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలులో గిద్దలూరుకు నుంచి శనివారం రాత్రి హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు వెళ్తుండగా సెలఫోన్‌ను పోగొట్టుకున్నామని తెలిపారు. కొరియర్ ద్వారా సెల్‌ఫోన్‌ను పంపనున్నట్లు విజయకుమార్‌కు వార్డెన్ చెప్పారు.



'కాయ'కష్టం

ఎండలు భగ్గుమంటున్నాయి.. మిరప ఘాటుతో ముక్కుపుటాలు అదురుతున్నాయి. ఆవేమీ పట్టించుకోకుండా కర్నూలు మండలం శివరామపురం గ్రామంలో మహిళలు మిరప కాయల గ్రేడింగ్ పనులు చేస్తున్నారు. చూసేవారంతా తల్లులు ఎలా తట్టుకుంటున్నారు అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. – కర్నూలు(రూరల్)